# ఇంటర్ సప్లిమెంటరీ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఈ విషయాన్ని ఇంటర్మీడియట్‌బోర్డు కార్యదర్శి ఒమర్ జలీల్‌కు సందేశం పంపి ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పదవ తరగతి వార్షిక పరీక్షలను రద్దుచేసి విద్యార్థులందరినీ అంతర్గత మార్కుల ద్వారా ఉత్తీర్ణులుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో తప్పిన విద్యార్థులను ఎలా ఉత్తీర్ణులుగా ప్రకటించాలన్న అంశా నికి సంబంధించి పూర్తి స్థాయిలో కసరత్తు చేయాలని రెండు ప్రత్యామ్నాయాలను సూచించాలని ప్రభుత్వం ఇంటర్‌బోర్డు కార్యదర్శిని కోరింది. మార్చిలో జరిగిన ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాలను జూన్ 18న విద్యామంత్రి సబిత ప్రకటించారు. దాదాపు 3.30 లక్షల మంది ఫెయిల య్యారు. ప్రభుత్వం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో తప్పి సప్లిమెంటరీ పరీక్షల కోసం వేచి చూస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించినట్లయింది. అయితే పరీక్షల్లో తప్పిన విద్యార్థులను ఎలా ఉత్తీర్ణులుగా ప్రకటించా లన్న అంశంపై ఇంటర్మీడియట్ బోర్డు బుధవారం రాత్రి నుంచే కసరత్తు ప్రారంభించింది. ఉత్తీర్ణులుగా ప్రకటిం చడానికి రెండు ప్రత్యామ్నాయాలను సిద్ధంచేసే పనిలో బోర్డు ఉన్నట్టు సమాచారం. వివిధ రాష్ట్రాలు అమలు చేసిన విధానాలను పరిగణలోకి తీసుకుని ఆయా ప్రభుత్వాలకు చెందిన అధికారులతో సంప్రదించి అక్కడి సమాచారాన్ని తెప్పించుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం.

## మొదటి ప్రత్యామ్నాయం

విద్యార్థి ఏ సబ్జెక్టులో ఎన్ని మార్కులతో తప్పాడో ముందు గుర్తించి ఉత్తీర్ణతకు ఎన్ని మార్కులు కావాలో అన్ని మార్కులు కలపడం మొదటి ప్రత్యామ్నా యమని అధికారులు చెబుతున్నారు. ఒక విద్యార్థి ఒక సబ్జెక్టులో తప్పాడా, రెండు సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాడా ఇలా ఎన్ని సబ్జెక్టుల్లో తప్పాడు, ఎన్ని మార్కులు సాధిం చాడు అనే గణాంకాలను తీయవలసి ఉం టుంది. తప్పిన సబ్జెక్టులకు మార్కులు కలిపి ఉత్తీర్ణులుగా ప్రకటించడం మొదటి ప్రత్యామ్నా యమని చెబుతున్నారు.

## మొదటి ప్రత్యామ్నాయం

రెండో ప్రత్యామ్నాయం ప్రకారం విద్యార్థులందరినీ ఉత్తీర్ణులుగా ప్రకటించడం. ఎన్ని సబ్జెక్టుల్లో తప్పాడు, ఎన్ని మార్కులు వచ్చాయన్న అంశాల జోలికి వెళ్ళకుండా అందరినీ పాస్ చేయడమని చెబుతున్నారు. అయితే రెండు ప్రత్యామ్నాయాల్లో విద్యార్థులకు ఇచ్చే మార్కుల జాబితాలో మాత్రం పాస్ అని ఇవ్వకుండా కంపార్టుమెంటల్ పాస్‌గా టైప్ చేసి ఇవ్వనున్నట్టు సమాచారం. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించడం కుదరదని విద్యార్థులను విద్యా సంవత్సరం నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం అందరినీ ఉత్తీర్ణులుగా ప్రకటించాలన్న నిర్ణయం తీసుకుందని ఉత్తర్వులను జారీచేసి ఆ ఉత్తర్వుల ప్రకారం ఫలితాలను ప్రకటించాలని నిర్ణయించినట్టు ఇంటర్‌బోర్డు విద్యార్థులకు ఇచ్చే మార్కుల జాబితాలో స్పష్టం చేయనున్నట్టు సమాచారం. ఫలితాల ప్రక్రియను ప్రారంభించే ముందు విద్యాశాఖ ఉన్నతాధికారులు అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, న్యాయశాఖ కార్యదర్శితో సంప్రదించి తదుపరి చర్యలను చేపట్టాలని ప్రభుత్వం కోరినట్టు సమాచారం. ఫలితాల ప్రకటనకు సంబంధించి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైతే ఈ విషయాన్ని ముందే హైకోర్టు దృష్టికి తీసుకువెళ్ళాలని కూడా ప్రభుత్వం ఆదేశించినట్టు సమాచారం.